


## నెలనెలా నవ్వుల పండగ



## కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

**యమధర్మరాజు** ముందుకు ఇద్దరు ప్రాణులని విచారణకి తీసుకువచ్చారు యమభటులు. వారిలో కరు హరికథలు చెప్పే దాసుగారు, ఇంకొకరు ఆర్.టి.సి బస్ డ్రైవర్.

యమధర్మరాజు ఇద్దరి చిట్టాలు తిరగేసి బస్ డ్రైవర్‌ని స్వర్గానికి, దాసు గారిని నరకానికి పంపమని చెప్పాడు. తన భటులతో. అది విన్న దాసుగారు
"రామ ..రామ.. ఇదెక్కడి అన్యాయమండీ. నిత్యం రామనామం జపించి, రామకథని ప్రచారంలో ఉంచిననాకు నరకమా? బస్ డ్రైవర్‌కి స్వర్గమా? ఇదేం న్యాయం యమధర్మరాజా!?" అని మొరపెట్టుకున్నాడు.

అందుకు యమధర్మరాజు ఇలా జవాబిచ్చాడు..

"దాసుగారూ! తమరి హరికథా కాలక్షేపానికి వచ్చిన వాళ్ళంతా పగలయినా మీ గొంతు వినగానే నిద్రపోయేవారు. అదే రాత్రయినా ఇతని బస్సు ఎక్కిన ప్రయాణీకులు ప్రాణాలుగ్గబట్టుకుని మేలుకుని దైవస్మరణ చేసేవారు. అదీ తేడా..!"

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"ఇన్నాళ్ళూ దొంగగా జీవించి నువ్వు గ్రహించిందేమిటి?" ఓ సంఘసంస్కర్త ప్రశ్నించాడా వృద్ధుడైన దొంగని.

"కత్తిగానీ, కత్తెరగానీ లేకుండా ఎప్పుడూ దొంగతనానికి వెళ్ళకూడదని" చెప్పాడా దొంగ.

"దేశంలో చదువుకున్న వాళ్ళకి విలువలేకుండా పోయింది. ఆ పక్కనున్నతన్ని చూశావా? పాపం బి.ఏ పాసయి కూడా ఉద్యోగం లేక బిచ్చమెత్తుకుంటున్నాడు" సానుభూతిగా అన్నాడో యువకుడు స్నేహితుడితో.

ఆ మాట విన్న బిచ్చగాడు అందుకున్నాడు "అందులో గొప్పేముందుసార్. నా పక్కనున్న కుర్రాడు ఎం.ఏ పాసయినాడు. కానీ ఉద్యోగం లేదు. ఏదో నేను జాలిపడి నా అసిస్టెంట్‌గా నెలకు మూడొందల జీతంతో ఏర్పాటు చేసుకున్నాను."

ఓ ధనవంతుడి భార్య ప్రమాదవశాత్తు నదిలో మునిగి పోతుండగా ఒడ్డునున్న కొందరు యువకులు రక్షించారు. ఆ విషయం తెలిసిన ధనవంతుడు ఆదుర్దాగా అక్కడికొచ్చాడు. అప్పుడు

"మీ భార్యకు మరేం పర్లేదు. ఆమెకు కృత్రిమ శ్వాసను కల్పిస్తున్నాం" అన్నారా యువకులు.

"ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. కృత్రిమమేం ఖర్మ అసలు శ్వాసనే అందజేయండి" మరింత ఆదుర్దాగా అన్నాడా పల్లెటూరి ధనవంతుడు.

"ఈ సీన్లో మీరు ఆ ఇంట్లోకి ప్రవేశించగానే, ఇంటి యజమాని మిమ్మల్ని బయటకు గెంటేస్తాడు. మీరు మళ్ళీ లోనికి వెళ్ళబోతుంటే తిరిగి బయటకు గెంటేస్తాడు. మూడు నాలుగుసార్లు ఇలా నటించాలి. ఓకే" చెప్పాడు డైరెక్టర్ ఎగస్ట్రా నటుడితో.

టేకులు లేకుండా ఓకే చేసిన ఆ నటుడితో "వెరీగుడ్. ఏమీ అనుభవం లేకుండా ఇంత సహజంగా ఎలా నటించగలిగారు?" ఆశ్చర్యంగా అడిగాడు డైరెక్టర్.

"నేను ఒకప్పుడు భీమా కంపెనీ ఏజెంటును."

"డాక్టరుగారూ నాకు రాత్రిపూట చిన్న చప్పుడయినా సరే మెలకువ వచ్చేస్తూంటూంది. మా పక్కింట్లో పావురాలు గుడగుడమని శబ్దం చేసేచాలు మెలకువ వచ్చేస్తూంది. ఏం చేయమంటారు?" అడిగాడు రోగి.

కొంచెం సేపు ఆలోచించిన డాక్టర్ ఓ పాకెట్ ఇచ్చి "దీన్ని వాడి చూడండి" అన్నాడు.

"దీన్ని ఎలా వేసుకోవాలి?"

"మీరు వేసుకోనక్కరలేదు. ఈ మందు ఆ పావురాలకి పెట్టండి చాలు."

"తెలిసో తెలియకో దొంగతనం చేసిన వ్యక్తి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు పశ్చాత్తాప పడక తప్పదు" తనలో తను అనుకుంటున్నట్లుగా అన్నాడు భర్త.

"ఆమాట నిజమే. పెళ్ళికి ముందు మీ హృదయాన్ని దొంగిలించిన నేరానికి నేను పశ్చాత్తాప పడటంలేదూ?" అంది పక్కనే వున్న భార్య.

"మీ అబ్బాయి శాకాహారి అని చెప్పారు కదూ మీరు?" అడిగింది టీచరు రాము తల్లిని.

"పక్కా శాకాహారి. అయినా మీకెందుకు సందేహంవచ్చిందీ విషయంలో?"

"రోజూ స్కూల్లో నా మెదడు తినేస్తున్నాడు, మరి మీవాడూ శాకాహారి ఎలా అవుతాడూ అని నా అనుమానం."

"బీరు పుచ్చుకున్నప్పుడు నన్ను రాణి అంటారు. బ్రాందీ పుచ్చుకుంటే డార్లింగ్ అంటారు. ఈ రోజు ఏం పుచ్చుకున్నారేమిటి దేభ్యం మొహమా అంటున్నారు?" అడిగింది భార్య.

"ఈ రోజు మందుషాపులు మూసేశారు. అదీ సంగతి వివరించాడు భర్త.

"నాకు జలుబు చేసినపుడు వదిలించుకోవడం చాలా సింపుల్. ఓ ఫుల్‌బాటిల్ విస్కీ కొంటాను. ఐదు నిమిషాల్లో ఎగిరిపోతుంది... అంతే"

"అంత త్వరగా జలుబెలా పోతుంది? ఆశ్చర్యంగా ఉందే?"

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? జలుబుకాదు ఎగిరిపోయేది బాటిల్లోని విస్కీ."

COMMENTS